కథ

**పులిపాక కనకదుర్గ**

# క్షణికం

**లైటు వేసుకోకుండా చీకట్లోనే కూర్చుండిపోయింది మాయ. కళ్లు ధారాపాతంగా వర్షిస్తున్నాయి.**

**'అసలెందుకిలా జరిగింది? ఇంత అవమానం జరిగాక ప్రపంచానికి తన మొహం ఎలా చూపించగలదు?**

**భూమి రెండుగా చీలి తనందులో కూరుకుపోతే బాగుండు.**

రేపట్నించీ అందరికీ ఇదో హాట్ టాపిక్. ప్రమోషన్ రేసులో తను ముందుంటుందని నరేంద్రకు తనంటే కన్నెర్ర. ఇంకా తనంటే పడని నందినికి, సరితకు అందరికీ పండగే.'

ఉన్నట్టుండి ఎవరో లైటు వేసారు.

''అమ్మా నాకు ఆకలి వేస్తోంది. అన్నం వండకుండా ఇక్కడ కూర్చున్నావేం? రా'' మాయ రెక్క పట్టుకుని లాగుతూ అంటున్నాడు ఎనిమిదేళ్ల కొడుకు.

''ఏమయిందమ్మా? ఎందుకలా లైటు వేసుకోకుండా ఒక్కదానివి కూర్చున్నావు?'' విచారంగా ఉన్న తల్లి వదనాన్ని గమనిస్తూ అంది పదకొండేళ్ల కూతురు.

ఆడపిల్ల వయసు చిన్నదేగానీ, స్వతహాగా తెలివయినది. గ్రహింపు జ్ఞానం ఎక్కువ. తల్లి ప్రవర్తనుబట్టి ఏదో జరిగి ఉంటుందని గ్రహించింది.

''అమ్మా అన్నం వండి, చారు చెయ్యనా?'' తల్లి పక్కకొచ్చి నెమ్మదిగా అందా అమ్మాయి. ఏడో క్లాసు చదువుతున్న పప్పీకి ఆ రెండు అయిటమ్స్ మాత్రమే చెయ్యటం వచ్చు.

మాయకు ఒక్కసారిగా హృదయం కలచివేసినట్టయ్యింది.

''కొద్దిసేపు ఓపిక పట్టండి, వంట చేసి వడ్డిస్తాను'' కళ్లు తుడుచుకుని, పిల్లల్ని దగ్గరకు తీసుకుంటూ అంది మాయ.

కుక్కర్ పడేసి పిల్లలకు భోజనాలు పెట్టి బెడ్ రూంలోకి వచ్చేసరికి పదయ్యింది.

దిండ్లకు జారగిలబడి కూర్చోంగానే ఎందుకో మళ్లీ దుఃఖం పొంగుకొచ్చింది. వద్దనుకుంటున్నా ఉదయం జరిగిన సంఘటనే కళ్లముందు నిలిచింది.

పంక్చువల్‌గా ఆఫీసుకొచ్చి సిన్సియర్‌గా పని చేసుకుంటోంది మాయ. రెండు అర్జంట్ లెటర్స్‌ని డ్రాఫ్ట్ చేసి, డిస్పాచ్ సెక్షన్‌కు పంపించింది. బాంకర్స్‌కు ఫోన్ చేసి బాలన్స్ వివరాలు కనుక్కుంది. ట్రయల్ బాలెన్స్ ముందేసుకుని కూర్చుంది.

అప్పుడొచ్చాడు భవానీప్రసాద్.

భవానీ వడ్డీకి అప్పులిస్తుంటాడు. అంతకుమించి గూండాయిజం చేస్తుంటాడు.

రాగానే జబర్దస్తీగా మాయ ముందున్న కుర్చీ వెనక్కులాగి కూర్చున్నాడు.

అప్పుడే మాయ సీటు దగ్గరకు వచ్చిన ఒరిద్దరు కొలీగ్స్ భవానీని చిత్రంగా చూశారు.

''ఏంది గట్ల ముకంల ముకం పెట్టి జూస్తవ్? తియ్యి పైసలు'' పెద్దగొంతుతో అరిచాడు భవానీ.

బిక్కచచ్చిపోయింది మాయ.

''భవానీ కొంచెం నెమ్మదిగా మాట్లాడు'' బ్రతిమిలాడుతున్నట్టు అంది మాయ.

''ఏంది మెల్లగా మాట్లాడేది? ఏడాదినుంచి తిప్పించుకుంటున్నావ్? ముందు పైసలు తియ్యి'' రెచ్చిపోయి మరింత గట్టిగా మాట్లాడాడు భవాని.

అప్పటికే కొంతమంది సీట్లలోంచి లేచి మరీ వినోదం చూస్తున్నారు.

''భవానీ! ఆయన ఈ దేశంలో లేరని నీక్కూడా తెలుసు. అన్నీ తెలిసి ఇలా ఆఫీసుకొచ్చి గొడవ చెయ్యటం బాగుందా? దయచేసి వెళ్లిపో. నీ బాకీ మొత్తం ఎలాగయినా పదిరోజుల్లో తీర్చేస్తాను'' ఏడుపును దిగమింగుకుంటూ అంది మాయ.

''ఆఖరుసారి నీకీ అవకాశం ఇస్తున్నాను. పదిరోజుల్లో బాకీ మొత్తం తీర్చకపోతే నిన్ను నా ఇంటికి తీస్కపోయి ఊడిగం చేయిస్తా'' తర్జనితో బెదిరిస్తూ, పిడికిలితో గట్టిగా టేబుల్ మీద కొడ్తూ రంకెలు వేశాడు భవాని.

టేబుల్ గ్లాస్ భళ్లున బద్దలయ్యింది.

అవమానంతో కందిపోయింది మాయ మొహం.

ఒకరిద్దరు చాటుగా నవ్వుకోవడం గమనించి మరింత కృంగిపోయింది మాయ.

'సమయానికి బాస్ లేరు కాబట్టి సరిపోయింది. ఉండుంటే ఇంకెంత రభస అయ్యేదో?' అనుకోకుండా ఉండలేకపోయింది.

మాయ భర్త పరశురాం దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. గత ఏడాది దుబాయ్‌లో పని ఇప్పించినందుకు ఏజంట్ కమీషన్, ఇతరత్రా ఖర్చుల నిమిత్తం భవానీ దగ్గర యాభై వేలు అప్పుగా తీసుకున్నారు. బాకీ మొత్తం ఆర్నెల్లలో తీర్చెయ్యాలని ఒప్పందం. అనుకున్న ప్రకారం డబ్బు కూడాపెట్టింది మాయ. కానీ, అనుకోనివిధంగా అత్తగారికి అత్యవసరంగా ఏదో ఆపరేషన్ చేయించాల్సివచ్చి కూడబెట్టిన డబ్బంతా ఖర్చయిపోయింది. అప్పట్నించి మొదలయ్యింది భవాని గొడవ. ఈ నెలాఖరుకు ఓ పాతిక వేలు పంపిస్తానని పరశురాం ధైర్యం చెప్పాడు. ఆఫీసులో లోన్లు, మరి కొంత చేబదులుగా తెచ్చయినా భవానీ అప్పు తీర్చేయాలని మాయ కూడా తొందరపడుతోంది.

ఇంతలో భవానీ వచ్చి అనవసరంగా గొడవ చేసి పరువు తీసాడు.

జరిగినదంతా గుర్తుకొచ్చేసరికి దుఃఖం మరింత ఉధృతమయ్యింది మాయకు. పిల్లలు నిద్రలేస్తారేమోనని ఏడుపుని గొంతులోనే దిగమింగుకుంది.

ఆ రాత్రంతా నిద్రపట్టక పిచ్చి పిచ్చి ఆలోచనలతోనే గడిచిపోయింది మాయకు. 'ఆత్మహత్య చేసుకుందామా? లేదా ఊరు విడిచి వెళ్లిపోదామా?' అని పరి పరివిధాలుగా తలపోసింది. కానీ పిల్లలూ, వాళ్ల భవిష్యత్తు గుర్తొచ్చి పిచ్చి ఆలోచనలు కట్టిపెట్టింది.

ఎట్టకేలకు తెల్లవారింది.

నిరాసక్తంగా పనులు చేస్తోంది మాయ.

పిల్లలకు టిఫిన్ పెట్టి, బాక్సులు సర్దింది. అత్తగారికి పత్యపు వంట చేసింది. స్నానం చేసి తల దువ్వుకోకుండా అలానే కూర్చుండిపోయింది.

పిల్లలు స్కూలుకి వెళ్లిపోయారు.

ఆఫీసుకు ఎలా వెళ్లటం అన్న సమస్య క్షణ క్షణానికి పెద్దదయ్యి భూతంలా కళ్లముందు నిలిచిపోయింది.

తొమ్మిది గంటలకు ఫోన్ మోగింది.

తియ్యాలా, వద్దా అన్న సందిగ్ధంలో ఉండిపోయింది మాయ. ఫోన్ ఆఫీసులో పనిచేసే కొలీగ్స్ నుంచి అయితే భరించగలిగే శక్తి లేదు ఆమెకు.

ఫోన్ మోగుతూనే ఉంది.

''మాయా ఫోన్ వచ్చినట్టుంది, మాట్లాడు'' తన గదిలోంచి కీచుగా అరిచింది అత్తగారు.

చిరాకుపడుతూ ఫోన్ లిఫ్ట్ చేసింది మాయ.

అవతల పరశురాం. ''ఏమయ్యింది మాయా ఇంతసేపు చేశావు?'' అడుగుతున్నాడు.

''ఏం లేదు. పనిలో ఉన్నాను'' నిర్లిప్తంగా ధ్వనించింది మాయ స్వరం.

కాసేపు మాట్లాడి రెండ్రోజుల్లో డబ్బు పంపిస్తున్నానని చెప్పి ఫోన్ పెట్టేశాడు పరశురాం.

నీరసంగా వచ్చి కుర్చీలో కూలబడింది మాయ. రాత్రి ఏమీ తినకుండా పడుకుందేమో కళ్లు తిరుగుతున్నట్టు అనిపించింది మాయకు.

ఆఫీసుకు వెళ్లాలా, వద్దా అన్న మీమాంస మళ్లీ మొదలయ్యింది.

'ఎలా రిసీవ్ చేసుకుంటారు తనని? వాళ్ల వాడి చూపులను తను తట్టుకోగలదా? ఆ వంకర కామెంట్స్‌ని తను భరించగలదా?' ఆలోచనలతో తల పగిలిపోతున్నట్టు అనిపించింది.

ఉన్నట్టుండి మరోసారి ఫోన్ మోగింది.

విసుక్కుంటూ లిఫ్ట్ చేసింది.

నరేంద్ర గలగలా మాట్లాడుతున్నాడు.

''గుడ్‌న్యూస్ మాయా. మొన్నటిదాకా ఒకటే వేకెన్సీ వస్తుందనుకున్నాం కదా! ఇప్పుడు రెండు వెకెన్సీలు క్రియేటయ్యాయిట. సెంట్రల్ ఆఫీసులో పనిచేసే నా ఫ్రెండు ఇప్పుడే ఫోన్ చేసి చెప్పాడు. మనిద్దరమే ఎలిజిబుల్ కాండిడేట్స్‌మి'' ఉత్సాహంగా చెప్పాడు. ప్రమోషన్ వస్తుందన్న ఆశ ధ్వనించింది అతని స్వరంలో.

నిన్నటి సంఘటన తాలూకు ఎఫెక్టు అతని స్వరంలో మచ్చుకు కూడా లేదు.

కొద్దిగా తేరుకుంది మాయ.

గబగబ తల దువ్వుకుని తయారయ్యింది. చీర మార్చుకుని, చెప్పులు తొడుక్కుంది. అత్తగారితో చెప్పి తలుపులు దగ్గరగా వేసి పక్కవీధిలో ఉంటున్న కొలీగ్ శర్మగారింటికి బయలుదేరింది.

నరేంద్ర అయితే ప్రమోషన్ మత్తులో జరిగిన విషయాన్ని మర్చిపోయి ఉంటాడు. మిగిలినవాళ్ల ఫీలింగ్స్ ఎలా ఉంటాయో అన్న భయం మాయను ఇంకా వెంటాడుతోంది. అందుకే శాంపుల్‌గా శర్మగారి ఫీలింగ్స్ చూద్దామని బయలుదేరింది.

మాయను చూడగానే శర్మగారి మొహం విప్పారింది.

''సమయానికొచ్చావు మాయా. ఈరోజు మా అమ్మాయిని చూట్టానికి పెళ్లి వారొస్తున్నారు. ఇప్పుడే ఈ విషయం ఫోన్ ద్వారా తెలిసింది. ఈరోజు నేను ఆఫీసుకు రావటం లేదు. క్యాష్ కీస్ నా దగ్గరే ఉన్నాయి. కీస్ ఆఫీసర్‌గారికిచ్చి, విషయం బాస్‌కు చెప్పు'' రిక్వెస్టింగ్‌గా అన్నారు.

శర్మగారి కుటుంబసభ్యులు ఎప్పట్లా ఏమీ జరగనట్టే మాట్లాడారు.

చాలా రిలీఫ్‌గా అనిపించింది మాయకు.

గబగబా ఇంటికి వచ్చి టిఫిన్ చేసి ఆఫీసుకు బయలుదేరింది.

''ఏం మాయా ఈవేళ నీక్కూడా లేటయ్యిందేం? కంప్యూటర్స్ బై బ్యాక్ ఫైల్ తీసుకుని నా కాబిన్‌కి వచ్చెయ్యి'' ఎదురొచ్చి చెప్పేడు బాస్.

బిక్కుబిక్కుమంటున్న మాయ హాయిగా నిట్టూర్చింది.

మధ్యాహ్నం లంచ్ తరువాత నలుగురు లేడీస్ ఒక చోట గుమిగూడి మాట్లాడుకుంటుంటే బెరుకుగా అనిపించింది.

కాసేపయ్యాక స్టెల్లా వచ్చి చెప్పింది ''చూశావా



వీరేశం ఎప్పట్లాగా తాగొచ్చి గొడవ చేస్తున్నాడు. ఇలా అయితే ఆఫీసులో పనిచేయటం కష్టమే.''

పెద్ద బరువు దిగిపోయినట్టనిపించింది మాయకు.

'కొత్తొక వింత పాతొక రోత అన్నట్టు నిన్నటి విషయం అప్పుడే పాతబడిపోయింది. అంతేకాదు ఈ ప్రపంచంలో అందరూ వారి పనులతోనూ, సమస్యలతోనూ సతమతమవుతుంటారు. ఎదుటి వారి గురించి ఆలోచించే సమయం ఎవరికీ ఉండదు. ఒకవేళ ఎవరయినా ఇతరుల విషయాలు పట్టించుకున్నా అది తాత్కాలికమే. ఇతరులకి మనల్ని గమనించటమే పని' అనిపించినా ఆ ఆసక్తి తాత్కాలికమే.'

కొత్త విషయం తెలిసినట్టయ్యింది మాయకు.

నిన్నటి తన ఆవేశం, ఆవేదన గుర్తుకొచ్చి తనకే భయం వేసింది.

ఆ ఆవేశంలో ఏదయినా విపరీతమయిన నిర్ణయం తీసుకుంటే ఎంత అనర్థం జరిగుండేది? పిల్లలు, భర్త ఏమయిపోయేవాళ్లు? అంతేకాదు, ఇంకెప్పుడు భవానీ లాంటి నీచుల దగ్గర అప్పు చేయకూడదు.

ఆవేశం క్షణికం! సమస్యలూ క్షణికమే!

అందుకే ఆవేశంలో ఏ నిర్ణయం తీసుకోకూడదు, సమస్యలకు భయపడకూడదు అనుకుంది ధైర్యం కూడదీసుకుంటూ.